క్లుప్తంగా

వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి



నున్న(విజయవాడరూరల్): వినాయక విగ్రహాల నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలని మండల తహసీల్దార్ బి.సుగుణ సూచించారు. నున్న గ్రామంలోని పోలవరం కాల్వలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రాంతాన్ని మంగళవారం ఆమె, నున్న సీఐ పి.కృష్ణమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలవరం కాల్వలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని పరిశీలించిన పిమ్మట బారికేట్లు ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. వాహనాలు కాల్వకు దూరంగా పార్కు చేసి నలుగురు మాత్రమే కాల్వలోకి దిగే విధంగా చర్యలు తీసుకోవాలని, బారికేడ్లు మించి పోలవరం కాల్వలోకి వెళ్లవద్దని చెప్పారు. నున్న సీఐ పి.కృష్ణమోహన్ మాట్లాడుతూ.. పోలీసు స్టేషన్ పరిధిలో 247 వినాయక పందిళ్లకు అనుమతులు మంజూరు చేశామన్నారు. టీడీపీ నాయకుడు యర్కారెడ్డి కోటిరెడ్డి, వీఆర్వో అనిల్ పాల్గొన్నారు.

రాయితీపై పశుదాణా అందజేత



తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలోని పశు వైద్యశాలలో మంగళవారం పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీ చేశారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని, గ్రామ సర్పంచి లాం ధిబోర 5.5 టన్నుల పశుదాణాను అందజేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ మల్లిబాబు మాట్లాడుతూ.. అధిక పోషక విలువలు కలిగిన ఈ దాణాతో పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, మనోజ్‌రెడ్డి, పశు వైద్యులు స్వర్ణలత, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన స్మార్ట్ రేషన్‌కార్డులను గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు పంపిణీ చేశారు. గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచి మాట్లాడుతూ గ్రామంలోని 4,520 రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం స్మార్ట్ కార్డులు మంజూరు చేసిందన్నారు. దశలవారీగా రెవెన్యూ, సచివాలయ సిబ్బంది స్మార్ట్ రేషన్‌కార్డులు ఇంటికి వచ్చి అందజేస్తారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో కిషోర్, డీలర్ లుక్కా అరుణ్, గ్రామస్తులు పాల్గొన్నారు. పెనమలూరు పల్లిపేటలో టీడీపీ మండల అధ్యక్షుడు కోయా ఆనంద్‌ప్రసాద్ స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, టి.ఉదయ్‌భాస్కర్, సీహెచ్ శ్రీనివాసరావు, షేక్ సైదులు, సుభాని పాల్గొన్నారు.

నున్న గ్రామానికి 5 వేల స్మార్ట్ కార్డులు

నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వం నున్న గ్రామానికి మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. గ్రామంలో మొత్తం 6 రేషన్ షాపులుండగా వాటి పరిధిలో 5,146 స్మార్ట్ కార్డులు మంజూరు చేసింది. స్మార్ట్ రేషన్ కార్డులను స్థానిక నాయకులు కె.శ్రీనివాసరెడ్డి, వై.కోటిరెడ్డి, గంపా శ్రీనివాసరావు, ఎం.శివరామకృష్ణప్రసాద్, ఆర్ఐ శరత్‌బాబు, వీఆర్వో అనిల్ పంపిణీ చేశారు.

చవితి వేడుకలకు ముస్తాబు



గన్నవరంలో గణనాథుని విగ్రహాలు కొనుగోలు చేస్తున్న భక్తులు



కేసరపల్లిలో ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న పందిరి

గన్నవరం/రామవరప్పాడు: వినాయక చవితి పండుగ సందర్భంగా గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే గ్రామాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. గన్నవరం, రామవరప్పాడు, హనుమాన్ జంక్షన్‌లోని ప్రధాన కూడళ్ల వద్ద గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేశారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌తో ప్రధాన సెంటర్లలో మంగళవారం సాయంత్రం వినాయక చవితి పూజకు ఉపయోగించే పత్రి, విగ్రహాలు, ఇతర సామగ్రి విక్రయాలతో కోలాహల వాతావరణం నెలకొంది. వీటిని కొనుగోలు చేసేందుకు వచ్చే జనంతో స్థానిక ఆగిరిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డుతో పాటు ప్రధాన కూడళ్లలో రద్దీ నెలకొంది. పర్యావరణ హితం కోరుతూ ఎక్కువ మంది మట్టి గణనాథుని విగ్రహాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించారు.



పోరంకిలో విక్రయిస్తున్న పూలు

జోరుగా వినాయకుడి పత్రి అమ్మకాలు

పెనమలూరు/కంకిపాడు: అన్ని కూడళ్ల వద్ద మంగళవారం సాయంత్రం పూజా పత్రి అమ్మకాలతో కిక్కిరిసిపోయాయి. దూరప్రాంతాల నుంచి వ్యాపారులు వాహనాల్లో వినాయక పత్రి తీసుకు వచ్చి రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేశారు. మట్టి వినాయక విగ్రహాలతో, రంగురంగుల వినాయక విగ్రహాలను విక్రయించారు. భక్తులు పూలు, పండ్లు, మామిడాకులు, వెలక్కాయ, తామరపూలు, తెల్లజిల్లేడు పూలు, మాచీపత్రం, బిల్వ పత్రం, దత్తూరపత్రం, వినాయక గొడుగులు, పాలవెల్లు, అరటి పిలకలు, పూల దండలు ఇలా అనేక పూజా సామగ్రి కొనుగోలు చేశారు. పండ్లు, పూల ధరలకు రెక్కలొచ్చాయి. యాపిల్, అరటి, బత్తాయి, దానిమ్మ, ఇతర పండ్ల ధరలు అధికంగా విక్రయించారు. పూల దండలు రూ.150కు పైగా, కొబ్బరికాయ ధర రూ 40 పలికింది. పెనమలూరు మండల పరిధిలో ఉత్సవాల అనుమతులకు ఆన్‌లైన్‌లో 230 దరఖాస్తులు వచ్చాయి. పోరంకి గ్రామ దేవత గంగానమ్మ గుడి వద్ద వినాయకవితి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శివసతి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. బుధవారం గణపతి పూజ నిర్వహించి 1,008 ఉండ్రాలతో వినాయక సహస్ర నామార్చన పూజ చేస్తామన్నారు. కంకిపాడు మండల వ్యాప్తంగా 92 చలువ పందిళ్ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చామని ఎస్ఐ సందీప్ తెలిపారు.

నకిలీ పత్రాలతో ఎరువుల వ్యాపారం.. అరెస్ట్



నిందితులను అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరుపర్చిన ఉయ్యూరు పోలీసులు

ఉయ్యూరు/ఉయ్యూరురూరల్: నకిలీ పత్రాలతో అక్రమంగా ఎరువుల దుకాణం నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను ఉయ్యూరు రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఉయ్యూరు సీఐ, కంకిపాడు ఇన్‌చార్జి సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల మేరకు...రైతుల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు నకిలీ అనుమతి పత్రాలను సృష్టించి వాటిని వినియోగిస్తూ ఉయ్యూరు మండలం కలవపాముల గ్రామంలో అక్రమంగా ఎరువుల దుకాణం నడుస్తోంది. కలవపాముల గ్రామం దూబామాలపల్లికి చెందిన కళ్లెం దిలీప్, కళ్లెం పవన్‌కుమార్‌లు ఇద్దరూ సోదరులు అనుమతి లేని దుకాణాన్ని నడుపుతున్నారు. ఈనెల 22న మండల వ్యవసాయాధికారి, రెవిన్యూ, పోలీసు సిబ్బంది నేతృత్వంలో ముందస్తు సమాచారంతో దుకాణంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో దుకాణం నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తించారు. షాపులో ఉన్న ఎరువులను సీజ్ చేశారు. ఈ క్రమంలో ఉయ్యూరు రూరల్‌పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కంకిపాడు ఇన్‌చార్జి సీఐ టీవీవీ రామారావు నేతృత్వంలో ఉయ్యూరు రూరల్‌ఎస్ఐ కె.సురేష్‌బాబు, కంకిపాడు అదనపు ఎస్ఐ తాతాచార్యులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసును అన్ని కోణాల్లోనూ విచారణ జరిపారు. ఈనెల 25న దూబామాలపల్లి నుంచి రాజుపేట వెళ్లే డొంక రోడ్డు నుంచి కళ్లెం దిలీప్, కళ్లెం పవన్‌కుమార్‌లు పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారు వినియోగిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇరువురూ నందివాడ ప్రాంతంలో చెరువులపై పని చేసేవారని గుర్తించారు. గుడివాడలోని ఓ షాపు యజమాని సహాయంతో నకిలీ పత్రాలు సృష్టించి అక్రమ ఎరువుల వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఏలూరులోని శ్రీరామాంజనేయ మెన్యూర్స్ కంపెనీ నుంచి ఎరువులు కొనుగోలు చేసినట్లు తేల్చారు. కేసును పూర్తి స్థాయిలో ఛేదించేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి విచారణ సాగిస్తున్నట్లు వెల్లడించారు.

మదర్‌థెరిస్సా జీవితం ఆదర్శప్రాయం



గన్నవరంరూరల్: మదర్ థెరిస్సా జీవితం ఆదర్శప్రాయమని ముస్తాబాద నవభారత్ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమాం చెప్పారు. మంగళవారం థెరిస్సా జయంతిని స్థానిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మదర్‌థెరిస్సా చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దాతలు చాగంటిపాటి ఆంజనేయులు సహకారంతో 300 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ



గన్నవరంలో మట్టి ప్రతిమలు అందజేస్తున్న పోలీస్ అధికారులు



పెనమలూరులో విగ్రహాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



హనుమాన్‌జంక్షన్‌లో పంపిణీ చేస్తున్న చలసాని

గన్నవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు ఉచితంగా వినాయకుని మట్టి విగ్రహాలను డీఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటి కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడే ప్రయత్నంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు మట్టి గణపయ్యలను పంపిణీ చేస్తున్నామన్నారు. సీఐ బీవీ శివప్రసాద్, ఎస్ఐ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరులో విగ్రహాల పంపిణీ

పెనమలూరు: వినాయక చవితి పండుగ సందర్భంగా పెనమలూరు పల్లిపేటకు చెందిన వరసిద్ధి వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత వినాయక మట్టి విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు. ఫ్రెండ్స్ సర్కిల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మట్టి వినాయక విగ్రహాలపై ప్రజల్లో అవగాహన కల్పించి పర్యావరణ పరిరక్షణకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రజలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు విగ్రహాల అందజేత

పెనమలూరు: కానూరు సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో మంగళవారం విద్యార్థులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కులపతి ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ప్రో ఉపకులపతి డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త జె.శివరామ్‌ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారి వేణుగోపాలరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా చవితి జరుపుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా చవితి వేడుకలు జరుపుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు కోరారు. హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలోని అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. అభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నందిగం వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, పట్టణ అధ్యక్షుడు షేక్ అహ్మద్, యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, గుమ్మడి శేషగిరిరావు, హనుమంతు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం



కంకిపాడు: అధికారులు, పంచాయతీ పాలకవర్గ అనాలోచిత చర్యలతో ప్రజాధనం దుర్వినియోగమైన సంఘటన మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానంతో ఒక్కో వార్డు పరిధిలో రెండు చొప్పున పంచాయతీ బల్లలను ఏర్పాటుచేయించారు. ఇందులో భాగంగా ఎస్సీ కాలనీలోని ప్రధాన సెంటరులో డ్రెయినేజీపై ఎవరికీ ఇబ్బంది లేకుండా పంచాయతీ రెండు సిమెంట్ బల్లలు ఏర్పాటుచేశారు. అయితే అధికారుల ఆదేశాలతో మంగళవారం ఈ బల్లలను పొక్లెయిన్‌తో తొలగించారు. ఈ క్రమంలో సిమెంటు బల్లలు ధ్వంసమై పనికి రాకుండా పోయాయి. ఈ విషయమై వార్డు సభ్యుడు నాగదేశి బాలకృష్ణ మాట్లాడుతూ అధికారులు, పాలకవర్గం కక్షపూరితంగా బల్లలను తొలగించిందన్నారు. తొలగించే క్రమంలో ధ్వంసం కావటంతో పంచాయతీ సొమ్ము దుర్వినియోగం అయ్యిందన్నారు. ప్రజలకు ఉపయుక్తంగా లేని ప్రదేశాల్లో బల్లలను ఉంచి వినియోగిస్తున్న బల్లలను తొలగించటం అనాలోచిత నిర్ణయమేనని ఆరోపించారు.

29న పిన్నమనేని సిద్ధార్థలో వర్క్‌షాప్



గన్నవరంరూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఈ నెల 29వ తేదీన డిపార్టుమెంట్ ఆఫ్ పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు కళాశాలలో మంగళవారం బ్రోచర్ ఆవిష్కరించారు. వర్క్‌షాప్ ఆన్ హెమోవిజిలెన్స్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా కార్యక్రమంలో వక్తలు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. స్టేట్ మెడికల్ కౌన్సిల్ భాగస్వామ్యంతో జరిగిన వర్క్‌షాప్‌లో ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ప్రొఫెసర్ నవీన్ చంద్రరావు, డాక్టర్ జాస్మిన్ సుల్తానా, ప్రొఫెసర్ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

31న యోగా పోటీలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఈ నెల 31వ తేదీ ఆదివారం నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో యోగా పోటీలను నిర్వహిస్తున్నామని కృష్ణా డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ స్థాయిలో బాల బాలికలకు, సీనియర్స్ పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ శనివారం ఉదయం 11 గంటలలోపు 94411 19909, 94402 76648 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా తెలియజేశారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు



మాలకొండారెడ్డి (ఫైల్)

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై పెనమలూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ద్రోణాదుల మాలకొండారెడ్డి(80)కు ముగ్గురు సంతానం. మాలకొండారెడ్డితో పాటు అతని భార్య జీవనోపాధికి వారి పిల్లలు నెలకు రూ.20 వేలు ఇస్తున్నారు. ఈ నెల 25న మాలకొండారెడ్డి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతని కోసం వెతికినా జాడతెలియక పోవటంతో కుమారుడు లక్ష్మీరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు



చలివేంద్రపాలెంలో తనిఖీలు చేస్తున్న రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు

గన్నవరం: యూరియా, ఇతర ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె. వెంకట శివయ్య ఫెర్టిలైజర్స్ దుకాణదారులను హెచ్చరించారు. స్థానిక శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, గోదావరి ఎరువుల దుకాణాలను వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖలతో కూడిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను, గోడౌన్లలోని సరుకు నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎరువుల సక్రమ పంపిణీకి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. యూరియా, ఇతర ఎరువుల విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖకు తెలియజేయాలని మండల వ్యవసాయ అధికారి కె.శివప్రసాద్ తెలిపారు. ఎరువుల అమ్మకాలను ఈ పోస్ మిషన్ల ద్వారా చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐ సుభాషిణి, వ్యవసాయ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల్లో లోపాలతో నిలిపివేసిన విక్రయాలు

కంకిపాడు: ఎరువుల స్టాకు, రిజిస్టర్‌లో వివరాల్లో వ్యత్యాసాలు ఉండటంతో ఎరువుల విక్రయాలను అధికారులు తాత్కాలికంగా నిలుపుదల చేశారు. మండలంలోని కంకిపాడు, నెప్పల్లి, చలివేంద్రపాలెం గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసుశాఖలు మంగళవారం సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. కంకిపాడులోని అన్నపూర్ణ ఫెర్టిలైజర్స్, బాలభారతి ఆగ్రో ట్రేడర్స్, నెప్పల్లి పీఏసీఎస్‌లలోని దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. వాస్తవ స్టాకు, రిజిస్టర్లకు వ్యత్యాసం ఉంది. సుమారు రూ 6.65 లక్షల విలువైన ఎరువుల విక్రయాలను నిలిపివేశామని వ్యవసాయశాఖ ఏడీ స్వర్ణలత చెప్పారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.భావనారాయణ, ఏవో ఉషారాణి, ఎస్ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.